కథ

# ఏం మనుష్యులో

-పోల్కంపల్లి శాంతాదేవి

"అమ్మా, ఒకసారి ఇలారా....త్వరగా...."

పెరట్లోనుండి మా అబ్బాయి కిరణ్...పదేళ్ళ వాడు పిలిచాడు. వాడి గొంతులో ఏదో అద్భుతాన్ని చూసినట్టుగా సంభ్రమం!

'పొయ్యిమీద పూరీలు కాలుస్తున్నానురా! వదిలి పెట్టివస్తే మాడిపోతాయి.సంగతేమిటో చెప్పు!' నూనె లో సుయ్‌మని పొంగిన పూరీని త్రిప్పేస్తూ అన్నాను.

"అబ్బా ! ఒక్కసారి రావే!"

"బాణలిలోంచి పూరీ బయటికి తీసి ప్లేట్‌లో ఉంచేసి, మంట బాగా తగ్గించి పెరట్లోకి వెళ్ళాను. ఏమిటి సంగతి? ఎందుకు పిలిచావు?"

"అటు చూడు!"

పెరట్లో విరగకాసిన జామచెట్టు ఒకటుంది. ఆ చెట్టు కొమ్మల్లోకి చూపాడు కిరణ్.

ఏ ఉడుతో కనిపించి ఉంటుంది వీడికి! ఏం చూసినా విచిత్రమే అనుకొంటూ అటు చూశాను. ముందు పొడుగాటి తోక కనిపించింది. ఇంకాస్త నిదానించి చూచేసరికి ఆకుల చాటునుండి ఆ తోక తాలుకు ఆకారం స్పష్టమైంది!

కోతి! బాగా పెద్దదిగానే ఉంది!


ఎప్పుడో ఏ తిరపతికో, యాదగిరిగుట్టకో వెడితే కోతులను చూడ్డం తప్ప మా ఊళ్ళో కోతులు లేవు! మా చుట్టు ప్రక్కల ఊళ్ళలోనూ లేవు!

ఇది ఎలా వచ్చిందో!

గుంపులోంచి తప్పిపోయి ఒంటరిగా మిగిలి పోయిన దిగులు దాని చింకి కళ్ళలో! బిక్కిరి చూపులు చూస్తోంది! కాయలేమీ కొయ్యడం లేదు. ఊరికే కొమ్మమీద కూర్చొంది, తన పొడగాటి తోక క్రిందికి వ్రేళాడేసుకొని!

కోతులంటే పిల్లలకి సహజంగానే సరదా, సంభ్రమం!

కిరణ్ రివ్వున ఇంట్లోకి పరిగెత్తి అరటిపండుతో తిరిగి వచ్చాడు.



అరటి పండున్న చెయ్యి చాచి, "రా,తిమ్మన్నా! పండు తీసుకో!" అని పిలిచాడు ఎంతో ఆత్మీయంగా.

కోతి కొమ్మల్లోంచి తల బయటికి పెట్టి కిచకిచమంటూ శబ్దంచేసింది. పండు వంక ఆశగా చూస్తోంది కాని చెట్టు దిగడానికి సంకోచిస్తోంది! అది వంటరిదై పోవడంవల్ల బిక్క చచ్చినట్లుగా ఉంది కానీఅదే ఏ తిరుపతి కొండమీది కోతో అయితేనా..చేతిలో ఉన్న పండు దౌర్జన్యంగా లాక్కుపోదూ?

## గెలీలియో

**(1564 - 1642)**

15 ఫిబ్రవరి 1864న గెలీలియో ఇటలీలో జన్మించాడు.పీసా విశ్వ విద్యాలయంలో గణితశాస్త్రాచార్యుడిగా పనిచేశాడు. గడియారంలోని లోలకం ఈయన పరిశోధన ఫలితంగా ఆవిష్కరింపబడింది.మొదటి సారిగా చంద్రమండలాన్ని పరిశీలించాడు. పాలపుంత అనేక నక్షత్రాల సముదాయమని చెప్పిందిఈయనే. భౌతికశాస్త్రపితామహునిగా పరిగణించబడే గెలీలియో 8-1-1642న మరణించాడు.

పండు తీసుకోడానికి కోతి ఎంతకీ దిగకపోయే సరికి కిరణ్ చేతిలోని పండు తీసి తులసికోట గట్టు మీద పెట్టి దూరం జరిగాడు.

అప్పుడు దిగింది కోతి!

ఛెంగున ఒక్క దూకు దూకి అరటి పండందుకొని పెరటిగోడ మీదికి ఎక్కి మెరుపులా మాయమై పోయింది. కిరణ్ కళ్ళలో నిరాశ.... కోతి అప్పుడే కనిపించకుండా పోయిందే అని!

"ఒరే, రామూ!మా పెరట్లోకి పెద్ద కోతొచ్చిందిరా! నేను అరటి పండిస్తే తీసుకొంది! " ఫ్రెండ్స్ తో చెప్పడానికి కిరణ్ పరిగెత్తాడు.

నూనె మాడిపోతున్న కంగారుతో నేను స్టవ్ దగ్గరకి పరిగెత్తాను.

ఆ తరువాత కోతి రెండు మూడు సార్లు మా పెరట్లో కనిపించింది. ఆ తరువాత కొద్ది రోజులకు జంటతో కనిపించింది. జత కుదిరిన సంబరంలో అది విజృంభించి జామ చెట్టు కాయల్ని పెరికి కొరికి పడేయడం మొదలు పెట్టింది. కచ్చి కచ్చి కాయల్ని అది పెరికి వేస్తుంటే ప్రాణం ఉసూరుమంది.

"ఉష్! ఉష్ !" అదిలించాను.

ఆ రెండు కోతులు కిచకిచ మంటూ గుర్రుగా చూడ్డం మొదలుపెట్టాయి. అవి ఏ క్షణంలోనైనా మీదికి జంప్ చేసి కరిచేలా ఉన్నాయి. భయమేసి ఇంట్లోకి వచ్చి కర్ర తీసుకు వెళ్ళాను.

"కోతి సాక్షాత్తు ఆంజనేయ స్వామి ప్రతిరూపం! కొట్ట కూడదు! పండో,కాయో ఇచ్చి మ్రొక్కితే శుభమౌతుంది !" మా అత్తగారు వారించారు.

"ఆంజనేయస్వామి మహా పండితుడు,జ్ఞానీ అని పురాణాల్లో చదువుకొన్నాం. ఆయనైతే ఇలా మంది పెరళ్ళలో జొరబడి చెట్టు కున్నకాయల్ని పెరికి పెరికి పారెయ్యడు కదా? అవి వట్టి కోతులే!" నేను కోపంగా కర్రతో బెదిరించాను కోతుల్ని.

అవి వెక్కిరిస్తున్నట్టుగా పళ్ళు బయటపెట్టి కిచకిచమని అరిచి.... ఏమనుకున్నాయో చెట్టు వదిలి వెళ్ళిపోయాయి.

కొన్నాళ్ళయ్యే సరికి కోతుల సంఖ్య పెరిగింది. వాటి ఆగడాలు పెరిగిపోయాయి. పెరట్లో కడగ డానికి గిన్నెలు వేస్తే వాటిని ఎత్తుకుపోవడం, అప్పు డప్పుడు ఇళ్ళలో జొరబడి వంటపాత్రలమీద దాడి చేయడం...అదిలిస్తే మీదపడి కరిచెయ్యడం.....

వాటి బాధ మా ఒక్కరికే కాదు, ఊరందరిదీ ! పెరట్లో మొక్కలు దక్కడం లేదు! కాయలు దక్కడం లేదు! వడియాలో, కొబ్బరిచిప్పలో ఎండబెట్టు కొన్నామా.... ఇహ ఇంతే సంగతులు.

ఆరోజు మా తమ్ముడు ఊరినుండి వస్తూ డజను అరటిపళ్ళు తెచ్చాడు. వాడు నాచేతి కందిస్తే డైనింగ్ టేబిల్‌మీద పెట్టి వాడికి టీపెట్టి ఇద్దామని వంటింట్లో కాలుపెట్టానో లేదో మాతమ్ముడు అరిచాడు. "అక్కా కోతి పళ్ళెత్తుకుపోతుందే" అని!

నేను పరిగెత్తాను మూలకున్న కర్ర అందుకొని.

బంగారంలా పచ్చగాపండిన పెద్దపెద్ద అరటి పళ్ళు! అక్క దగ్గరికి వస్తూ నా తమ్ముడు ప్రేమతో తెచ్చిన పళ్ళు! ఒక్కపండు కూడా తినక ముందే ముదనష్టపుకోతి ఎత్తుకుపోతోంది!

నాకు ఆగ్రహం తన్నుకు వచ్చింది.

కర్ర విసురుగా లేపాను.

అది హీరోయిన్‌లా ఒక చంకలో పండ్ల పొట్లం అదిమి పట్టి, మరో చేత్తో కర్ర అందు కొంది. నా కేసి గుర్రుగా చూస్తూ పళ్ళు బయటపెట్టి కిచకిచ మంది. "నామీద దెబ్బపడిందా నీఅంతు చూస్తాను" అన్నట్లుగా ఉన్నాయి దాని చూపులు!

అది నా మీదికి దూకి కరిచెయ్యదు కదా?

నాకు భయం వేసి కర్ర వదిలిపెట్టిదూరంగా జరిగాను.

**నార్ల వెంకటేశ్వరరావు**
**(1908 - 1985)**

1 డిశంబర్ 1908న జబల్‌పూర్‌లో జన్మించిన ఈయన 16 ఫిబ్రవరి 1985న మరణించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికకు తొలిసంపాదకులు వీరే. ఆంధ్రప్రభ దినపత్రికకు సుమారు 20 సంవత్సరాలు సంపాదకులుగా పనిచేశారు. మాటా మంతీ, ఆషామాషీ, రచనలతో పాటు 'నవయుగాల బాట నార్లమాట' 'వాస్తవమ్ము నార్లమాట' అనే మకుటాలతో పద్యాలు కూడా రాశారు. రాజ్యసభ సభ్యులుగా పనిచేశారు.

పళ్ళు పోతే పోయాయి! పదిరూపాయలు పడేస్తే వస్తాయి! కాని, అది మీదపడి రక్కి...కరి చిందా... డాక్టరు దగ్గరికి పరిగెత్తి కుక్కకాటుకు తీసుకునే ఇంజక్షన్లు బొడ్డు చుట్టూ తీసుకు చావాలి! మొన్న ఎదురింటి రాధమ్మను కోతి కరిస్తే డాక్టరు ఇంజక్షన్లు తీసుకోవాల్సిందేనన్నాడట!

బొడ్డుచుట్టూ ఇంజక్షన్లంటే ఆవిడ భయపడి ఎరుకలి వాళ్ళదగ్గర ఏదో నాటు మందు తిని పథ్యం చేస్తోంది!

కర్ర వదిలేశాను.

అది అరటిపళ్ళపొట్లం చంకలో పెట్టుకొని దర్జాగా వెళ్ళిపోయింది. బయట గోడలమీద కూర్చొన్న మరికొన్ని కోతులు పళ్ళని షేర్ చేసుకోడానికి దాన్ని అనుసరించాయి.

అరటిపళ్ళు పోతే పోయాయి ! అది రక్కనందుకు సంతోషించాను.

నా తమ్ముడు ఆశ్చర్యంగా, "మీ ఊళ్ళో కోతులు లేవు కదక్కా" ఇదెక్కడినుండి వచ్చింది?" అనడిగాడు.

"రెండు మూడేళ్ళక్రితం ఒకకోతి ఎక్కడినుండో వచ్చిందిరా! అదిజతకట్టి సంతానాభివృద్ధి చేసి నట్టుంది. ఓ పది పన్నెండు కంటే ఎక్కువ లేవుగాని అవి చేసే ఆగడాలు అన్నీ ఇన్నీకావు! ఎక్కడికి వెళ్ళినా గుంపుగా వెడతాయి! తినడానికి ఏవి కనిపించినా ఎత్తుకుపోతాయి. పెరట్లో మొక్కలుంచవు. కాయ లుంచవు. నలుగురం అమ్మ లక్కలం కలిస్తే చీరల గురించీ, నగల గురించీ చెప్పుకోవడం ఎప్పుడో మరచిపోయాం. కోతుల సంగతి తప్ప మరోసంగతి లేదు. మమ్మల్ని ఇలా సతాయిస్తు న్నాయంటే ఇలా సతాయిస్తు న్నాయని చెప్పుకోవడం! నిజంగా ఈ కోతులు మాకొక సమస్యగా తయారయ్యా యనుకో!"

"ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటుందిగా, అక్కా?"

"దీనికేం పరిష్కారం ఉందిరా? ఏ మందో మాకో పెట్టి చంపడానికి పందులో కుక్కలో కాదు. కోతులంటే మనకో భక్తి భావం! ఆంజనేయస్వామికి ప్రతిరూపాలని!"

"వాటిని చంపమని నేను చెప్పానా?" వాటిని పట్టి ఎక్కడైనా అడవిలో వదిలిపెడితే సరి!

"వాటినెవరు పట్టగలరు? వాటిజోలికి వెడితే పీకి చంపుతాయి!"

"మొండోళ్ళకు చెబితే వాళ్ళే పడతారు! మహా మహా విషసర్పాలనే అలవోకగా పట్టేసే వాళ్ళకి కోతులను పట్టడం ఓ లెక్క కాదు. కాకపోతే తలా కాస్త చందా వేసుకొని వాళ్ళకివ్వాలి!"

"వాటి పీడ వదులుతుం దంటే ఎంత డబ్బైనా ఇవ్వొచ్చు!"

మా వీధిలో ఉన్న కొందరిని కలిసి చర్చించాను.

కోతులను పట్టి దూరంగా అడవిలో వదిలెయ్యాలన్న ఆలోచన అందరికి నచ్చింది.

కానీ, ఆ ఆలోచన మా వీధి పిల్లలకే నచ్చలేదు. కోతుల పట్ల ఓవిధమైన ఆత్మీయతా భావం ఏర్పరుచుకొన్నారు వాళ్ళు. అరటిపళ్ళిచ్చి, కొబ్బరి చిప్పలిచ్చి, పప్పులేసి...వాటితో ఆడుకోవడం వాళ్ళకొక వినోదం. ముఖ్యంగా మా కిరణ్‌కి కోతులంటే పిచ్చి ప్రేమ. కోతి కనిపించగానే 'తిమ్మన్నా,తిమ్మన్నా'అంటూ పలక రింపులు!

వాడు వీధి పిల్లలందరినీ వెంటేసుకువచ్చాడు.

"వద్దు, ఆంటీ! కోతుల్ని మొండోళ్ళని పిలిచి పట్టివ్వ కండి!"పిల్లలంతా ఒకటే ప్రాధేయపడడం!

"మొండోళ్ళు పట్టుకుపోతే ఏమైంది? వాటిని తీసుకు పోయి అడవిలో వదిలేస్తారు. అక్కడవి హాయిగా ఉంటాయి!"

"కాదు,ఆంటీ! మొండోళ్ళు వాటిని చంపి తింటారు. పిల్లుల్నీ, పాముల్నీ, తొండల్నీ పట్టుకు తినేవాళ్ళు కోతుల్ని తినరా ఏం?"

"ఏం తినరు వాటిని అడవిలో వదిలి పెట్ట డానికేగా డబ్బిచ్చి పట్టిస్తున్నది?" వాళ్ళని సమాధాన పర్చి పంపించేసరికి నాతలప్రాణం తోకకి వచ్చింది. మాతమ్ముడు ప్రక్క ఊరినుండి మొండోళ్ళను తీసుకు వచ్చాడు. బేరం సెటిలైంది. ఒక్కకోతిని కూడా వదల కుండా పట్టుకుపోతే అయిదొందలిస్తామని ఒప్పు కున్నాం.ఆదివారం వచ్చి పట్టుకుపోతామని చెప్పారు.

ఆరోజు రానే వచ్చింది.

మా కిరణ్ దిగులుగా ముఖం పెట్టుకున్నాడు. టిఫిన్ తినలేదు. టీ త్రాగలేదు.

ప్రక్కింటి పిన్నిగారు సైతం "మొండోళ్ళని పిలిచి కోతుల్ని పట్టిస్తుంటే నాకూ ఎలాగో ఉంది, అమ్మాయ్! రాత్రి కల్లో ఆంజనేయస్వామి కనిపించాడు. ఇక శనివారం శనివారం ఆంజనేయస్వామి గుడికెళ్ళి ఆయన ముందు నిలబడ్డప్పుడల్లా కోతుల పట్ల మనం చేసిన అపచారమే గుర్తు వస్తుందే మో!" అందామె పశ్చాత్తాపంగా.

"అయితే మానేద్దామా, పిన్నిగారూ?"

వద్దులే! వాటి ఆగడాలకు తట్టుకోలేకుండా ఉన్నాం. పాపం వస్తే రానీ!"

"రోజూ మనం ఎన్ని పాపాలు చెయ్యడం లేదు. తెలిసో తెలియకో? వాటిలో ఇదొకటి!"

మొండోళ్ళు కోతులను పట్టు కోడానికి కావలసిన సరంజామా తో వచ్చారు. వాళ్ళు అయిదారు గురుదాకా ఉన్నారు. బనియన్లు, డ్రాయర్ల మీద ఉన్నారు.

కోతులను పట్టడం అంత సులభమేం కాలేదు. ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళుత్రాగిం చాయి. ఇలా తమని పట్టుకోడానికి వచ్చారని తెలియ గానే అవి బెదిరిపోయి చిటారు కొమ్మల్లోకి వెళ్ళి పోయాయి. కొమ్మనుండి కొమ్మకూ, చెట్టునుండి చెట్టుకూ పరుగులు పెట్టాయి.

ఏమైతేనేం, వలలు వేసి వాటినన్నింటినీ పట్టేసి. జాలి బుట్టల్లో బంధించి మొండోళ్ళ పేరును సార్థక పరుచుకున్నారు.

జాలిబుట్టల్లోంచి కోతులు బిక్కుబిక్కుమని చూస్తూ, తప్పించుకోవాలని ఆరాటంగా గంతులేస్తుంటే వాటి మీదున్న ఆగ్రహమంతా బాధగా మారిపోయింది.

ప్రక్కింటి పిన్నిగారూ మరికొంతమంది ఆడ వాళ్ళు కొబ్బరికాయలు తెచ్చికొట్టారు. కుంకుమ పెట్టి పూజలు చేశారు. పిల్లలయితే కోతులున్న బుట్టల చుట్టూ మూగిపోయారు. పళ్ళిచ్చారు, కొబ్బరిచిప్ప లిచ్చారు."టాటా, తిమ్మన్నలూ" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.

మొండోళ్ళు వీపుల మీదున్న బుట్టల్లో కోతులు వెళ్ళిపోతుంటే అందరి మనసులూ బాధగా మూలిగాయి. ఎందుకో అందరి మనసుల్లో ఒక అపరాధభావం మిగిలి పోయింది!

"ఏం మనుష్యులో వీళ్ళు! కోతి రూపంలో ఉన్న రాళ్ళకి పూజలుచేస్తారు. పాము రూపం లో ఉండే రాళ్ళకి పూజలు చేస్తారు! మళ్ళీ పాము కని పించినా, కోతి కనిపించినా కొట్టి చంపుతారు!" మా కిరణ్ ఆక్రోశంగా, కసిగా అనడం వినిపించింది!

అదెంత నిజం! ★


**పాఠకులకు, ఏజెంటులకు విజ్ఞప్తి**

**'చినుకు'** మాసపత్రిక కొరకు పంపవలసిన చందాలను, డిపాజిట్లను మీ దగ్గరలో ఉన్న ఆంధ్రాబ్యాంక్ శాఖలలో **చినుకు సాహిత్య మాసపత్రిక, గాంధీనగర్. C.A. No. 3694 లో** చెల్లించవచ్చు. దీనికి ఎటువంటి ఛార్జీ వసూలుచేయబడదు.